క్లుప్తంగా

జాబ్ మేళా



జాబ్ మేళా నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి, కమిషనర్ శేషఫణి

ఎర్రగుంట్ల: యర్రగుంట్ల మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఆదిత్య బిర్లా కంపెనీ సౌజన్యంతో గురువారం ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు స్పందన లభించిందని కమిషనర్ శేషఫణి తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి ప్రారంభించారన్నారు. సుమారు 60 మందిదాక మహిళలు పాల్గొన్నారు. జాబ్‌లో ఎంపికైన వారికి ఉచితంగా కుట్టు మిషన్ నేర్పించి వారికి నెలకు జీతం అందిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ నాగేంద్రతో పాటు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

నివాళి



మృతదేహానికి నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి: మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ తండ్రి రాములు (87) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి మృతదేహానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రవి, జయశంకర్,సురేష్ పాల్గొన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

పులివెందుల: పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ చేస్తారని తెలిపారు. అలాగే గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రారంభమైన భాగవత పఠనం



భాగవత పఠనం నిర్వహిస్తున్న భక్త సమాజ మండలి సభ్యులు

లింగాల: మండల కేంద్రమైన లింగాలలోని శ్రీరామాలయంలో గురువారం భాగవత పఠనం ప్రారంభమైంది. ఈ సందర్భంగా భాగవత పండితులు భగవద్గీత సారాంశం, భగవద్గీత శ్లోకాలు, తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భావత భక్త సమాజ మండలి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రైవింగ్‌తో ఉపాధి అవకాశాలు మెండు



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ నరసింహులు

వేంపల్లె: డ్రైవింగ్ నేర్చుకోవడం వలన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెండు ఉంటాయని రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సింహులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం స్థానిక కాలేజీ రోడ్డులో ఉన్న దివ్వరామంలో కవి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో డ్రైవింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు బీఎస్‌ఆర్ డ్రైవింగ్ స్కూల్ కరస్పాండెంట్ నాగేంద్రను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ప్రిన్సిపాల్ నర్సింహులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు డ్రైవింగ్ నేర్చుకుని ఉద్యోగాలు పొంది కుటుంబాలను పోషించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కవి డ్యాన్స్ అకాడమీ నిర్వాహకుడు కవి ప్రసాద్ రావు, విద్యార్థులు, బీఎస్‌ఆర్ డ్రైవింగ్ స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ అరటి తోట అగ్నికి ఆహుతి



మంటల ధాటికి దెబ్బతిన్న అరటితోట

మండలంలోని నల్లబల్లె గ్రామంలో ఐదే ఎకరాల్లో అరటి తోట గురువారం అగ్నికి ఆహుతైంది. బాధిత రైతు వాసుదేవరెడ్డి సమాచారం మేరకు మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో అరటి తోటలో మంటలు వ్యాపించాయని, సుమారు 1,000 చెట్లు దగ్ధమయ్యాయని తెలిపారు. సుమారు రూ.10లక్షల మేర ఆర్థిక నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. –ముద్దనూరు

◆ అరటికి ఈతాకు రక్ష



అరటి పిలకలకు రక్షణగా నాటిన ఈత కొమ్మలు

పులివెందుల నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన అరటి పంటలకు ఈతాకులే రక్షణగా నిలుస్తున్నా యి. రైతులు అరటి పిలకలను నాటినప్పుడు నుంచి వాటిని కాపాడుకునేందుకు వినూత్న ప్రయత్నాలు చేస్తుంటారు. అందులో భాగంగా అరటి పిలకలను కాపాడుకునేందుకు ఈత కొమ్మలను నాటుతున్నారు. ఒక్కో ఈత కొమ్మ రూ.3 నుంచి రూ.5 కొనుగోలు చేసి వాటికి రక్షణగా ఈత కొమ్మలను నాటుతున్నారు. వీటిని అనంతపురం, పెనుగొండ, హిందూపురం, సత్యసాయి జిల్లాల నుంచి కొనుగోలు చేస్తున్నారు. –పులివెందుల రూరల్

వైభవంగా సాగిన గ్రామోత్సవం



భక్తులను ఆకట్టుకొన్న కోలాటం



గ్రామోత్సవంలో సీతారాముల మూలమూర్తులు

వీరపునాయునిపల్లె: మండలంలోని కీర్తిపల్లె గ్రామంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా సాగుతున్నాయి. రెండవ రోజు సీతారామ లక్ష్మణ హనుమాన్ మూల మూర్తుల గ్రామోత్సవం డప్పు వాయిద్యాలు, బాణ సంచాపేలుస్తూ కోలాటాల మధ్య వైభవంగా సాగింది. ఈ ఉత్సవంలో గ్రామంలోని మహిళలే కాకుండా ఇతర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామోత్సవంలో నిడిజివ్వి గ్రామస్తులు నిర్వహించిన గంగా కోలాటం భక్తులను ఆకట్టుకుంది. కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ ధర్మకర్త వెంకటరామిరెడ్డి భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నేడు బండలాగుడు పోటీలు

విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో బాగంగా శుక్రవారం సీనియర్ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ పోటీలు ఉదయం 8గంటలకు ప్రారంభమవుతాయన్నారు. పోటీల్లో విజేత ఎడ్లకు మొదటి బహుమతి లక్ష రూపాయలు. రెండవ బహుమతి 80వేలు, మూడవ బహుమతి 60 వేలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో ఎద్దుల యజమానులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ



అవగాహన కల్పిస్తున్న మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య

సింహాద్రిపురం: పరిసరాల పరిశుభ్రతతోనే దోమలను నివారించవచ్చునని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్దయ్య పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని బలపనూరు గ్రామంలో డ్రై డే – ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, దోమ కాటువల్ల వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య మాట్లాడుతూ దోమ కాటువలన మలేరియా, డెంగీ, చికెన్ గన్యా, మెదడువాపు వ్యాధి, ఫైలేరియా వంటి వ్యాధులు వస్తాయన్నారు. లార్వా దోమగా మారకముందే నిల్వ ఉంచిన తొట్లు, బానలు, డ్రమ్ములు తదితర వాటి నుండి నీటిని పారబోసి వాటిని టెంకాయ పీచుతో శుభ్రపరుచుకోవాలన్నారు. దోమల నివారణకు అబైట్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఖలీల్ బాషా, ఆరోగ్య కార్యకర్త గంగాదేవి, ఆశా కార్యకర్తలు శివ కామేశ్వరి, సుదేష్ణ, శైలజ, తదితరులు పాల్గొన్నారు.

7 నుంచి ఇంటర్ అడ్మిషన్లు

తొండూరు: మండల కేంద్రమైన తొండూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 7వ తేదీ సోమవారం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు అడ్మిషన్లు ప్రారంభమవుతాయని కళాశాల ప్రిన్సిపాల్ మురళీధరరావు తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు కూడా కళాశాలలో చేరేందుకు అర్హులన్నారు. ఈ ఏడాది నుంచి సీబీఎస్‌ఈ సిలబస్ ప్రకారం విద్యా బోధన ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.

చంద్రబాబు ముస్లిం ద్రోహి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నూర్ బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్

పులివెందుల రూరల్: ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన స్వేచ్ఛను హరించడానికి వక్ఫ్ చట్ట సవరణ బిల్లు తెస్తున్నారని వైఎస్సార్‌సీపీ నూర్‌బాషా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రసూల్ పేర్కొన్నారు. గురువారం పులివెందులలో ఆయన విలేకరుల సమావేశం మాట్లాడుతూ ముస్లింల మనోభాలు దెబ్బ తీసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తెలిపారు. మైనార్టీల ప్రయోజనాలను దెబ్బతీసే వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు టీడీపీ, జనసేన మద్దతు తెలపడం దారుణంగా ఉందన్నారు.

రాష్ట్రంలో 50 లక్షలమంది ముస్లింల మనోభావాలను దెబ్బతీసేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో పులివెందుల నూర్ భాషా సంఘం అధ్యక్షుడు బాబా ఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి స్థల పరిశీలన



ఫైర్ స్టేషన్‌కు కేటాయించిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ సాయిశ్రీ

ముద్దనూరు: మండల కేంద్రం శివారులో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి సాయిశ్రీ గురువారం పరిశీలించారు. ముద్దనూరు–తాడిపత్రి జాతీయ రహదారిలో చెన్నారెడ్డిపల్లె గ్రామం వద్ద సుమారు 0.78 సెంట్ల విస్తీర్ణంలో స్థలాన్ని గతంలో అగ్నిమాపక కేంద్రం నిర్మాణానికి కేటాయించారు. ఈ నేపథ్యంలో ఈ స్థలాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు వరదకిషోర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కాగా గతంలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో వేంపల్లె, ముద్దనూరు కేంద్రాల్లో ఫైర్‌స్టేషన్ నిర్మాణాలకు అనుమతులు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఈ ఫైర్‌స్టేషన్ నిర్మాణంలో కదలిక రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రారంభమైన ఉచిత పాలీసెట్ తరగతులు

సింహాద్రిపురం: మండల కేంద్రమైన సింహాద్రిపురం సమీపంలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత పాలీసెట్ శిక్షణా తరగతులు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. గురువారం ఆయన తెలుపుతూ 2025 పాలీసెట్ ఈనెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరించబడునని, 30వ తేదీన పాలీసెట్ పరీక్షలో ఉంటుందని, కనుక ఆసక్తి కల విద్యార్థులు పాలీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ఉచిత స్టడీ మెటీరియల్ ఇవ్వడంతోపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంకా ఏమైనా సలహాలు కావాలంటే ఫోన్ నంబర్ 9010222184 సంప్రదించాలని కోరారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

ఎర్రగుంట్ల: అర్హులైన వారందరికీ షరతులతో సంబంధం లేకుండా ఇళ్లను, ఇంటి స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నా రు. గురువారం సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వం ఎన్నికలలో చెప్పిన హా మీలను నెరవేర్చాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 7,8,9 తేదీలలో సీపీఐ ఆధ్వర్యంలో నిరాహార దీక్షలను చేపడుతున్నట్లు తెలిపారు. టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో చోరీలకు చెక్



పోట్లదుర్తిలో సీసీ కెమెరాల పనితీరుపై ఆరా తీస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీలకు చెక్ పెట్టాలంటే ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టాలని ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు అన్నారు.

గురువారం ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎర్రగుంట్ల అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో అన్ని గ్రామాలలో ఇప్పటి వరకు సుమారు 400 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల చాలా వరకు దొంగతనాలు, దారిదోపిడీలను నియంత్రణ చేయవచ్చన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాల పనితీరుపై, వాటి ఆవశ్యకతను తెలుసుకోవాలన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో చాలా తక్కువ ధరలకే సీసీ కెమెరాలు లభిస్తున్నాయని, ప్రతి ఒక్కరు వాటిని ఇళ్ల వద్ద ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

అధిక మద్యం తాగి కార్మికుడు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నరేష్‌బాబు

ఎర్రగుంట్ల: ఎర్రగుంట్ల మండల పరిధిలోని జువారి సిమెంట్ కర్మాగారంలో కూలి పనులకు వచ్చిన మహారాష్ట్రకు చెందిన చైత్‌రాం (35) కార్మికుడు మృతి చెందాడని ఎర్రగుంట్ల పట్టణ సీఐ నరేష్‌బాబు తెలిపారు. గురువారం మహారాష్ట్రలోని నాగపూర్ సమీపంలో వైహర్డు క్రుద్ధ్ పంచాయితీకి చెందిన చైత్‌రాం జువారి ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం మద్యం తాగడానికి పొలాల్లోకి వెళ్లాడు, అక్కడ మద్యం అతిగా తాగి, ఎండ తీవ్రత అధికమైన నీరు దొరకపోవడంతో అక్కడే పడిపోయాడు. అతని ఆచూకి కోసం తోటి కార్మికులు చుట్టుపక్కల వెతికారు. పొలంలో ఓ గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విచారించిన పోలీసులు చైత్‌రాంగా గుర్తించారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టు మార్టర్ కోసం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిచామని సీఐ తెలిపారు.

ఉరుసుకు ఆహ్వానం

ఎర్రగుంట్ల : ఈ నెల 11వ తేదీన కమలాపురంలో నిర్వహించే దర్గా ఎ గఫ్ఫారియా ఉరుసు ఉత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డికి దర్గా కమిటీ నిర్వాహకులు ఆహ్వానించారు. గురువారం యర్రగుంట్ల పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని దర్గా కమిటీ నిర్వాహకులు కలిసి ఉరుసు వివరాలు తెలిపారు. ఈ ఉరుసు భారత దేశంలోని ప్రఖ్యాతిగాంచిన దర్గాలలో ఒకటిగా నిలిచిందన్నారు.

పెంచిన పని భారాన్ని తగ్గించాలి



పులివెందుల రూరల్: నిరసన తెలుపుతున్న ఎన్‌ఎంయూ నాయకులు



జమ్మలమడుగు రూరల్: ఆర్టీసీ డిపో ఆవరణలో ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు వచ్చిన కార్మికులు

జమ్మలమడుగు రూరల్: ఆర్టీసీ కార్మికులకు పెంచిన పని భారాన్ని వెంటనే తగ్గించాలని ఎస్‌ఎంయుఏ యూనియన్ నాయకులు పేర్కొన్నారు. గురువారం జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ఆవరణలో కార్మికులు ఎర్ర బ్యాడ్జీలను ధరించి విధులకు హాజరై నిరసన వ్యక్తంచేశారు. కార్మికులు మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ప్రభుత్వంలో విలీనం అయిన తరువాత ఎదుర్కొంటున్న సమస్యలు ఉన్నాయని, వాటిని అధికారులు పరిష్కరించాలన్నారు. బస్సులో టిక్కెట్లు తీసుకోకుండా ప్రయాణం చేసేవారికి ఇక మీదట కండక్టర్‌కు ఏమాత్రం సంబంధం లేకుండా.. తప్పు ప్రయాణికులదే చూస్తూ జీఓ విడుదల చేయాలన్నారు. మహిళా ఉద్యోగులకు నెలకు 3 రోజుల సెలవు మంజూరు చేయాలన్నారు. ఇంకా పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఎన్‌ఎంయూ నిరసన

పులివెందుల రూరల్: పట్టణంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణంలో గురువారం ఎన్‌ఎంయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఎన్‌ఎంయూ నాయకులు మాట్లాడుతూ తమ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఎన్‌ఎంయూ సభ్యులు పాల్గొన్నారు.